వీవో సంఘాలు భవనాలను నిర్మించుకోవాలి

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

జీవోను చూపిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 6 : గ్రామాల్లో మహిళా సంఘాలు భవనాలను నిర్మించుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంబంధిత జీవో పత్రాలను అన్ని వీవో మహిళా సంఘాలకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 102 వీవో మహిళా సంఘాలకు భవన నిర్మాణానికి సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) నుంచి జీవో 452 ద్వారా రూ.18.95కోట్లు గత అక్టోబర్ 4న మంజూరయ్యాయని తెలిపారు. దానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాన్ని కలెక్టర్‌కు ఇచ్చామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాలకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో మహిళా భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను గుర్తించి, గ్రామపంచాయతీ తీర్మానం, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసి గతంలోనే భూములను చూపామని పేర్కొన్నారు. గ్రామానికి ఒకటి చొప్పున శంకుస్థాపనలు చేసుకున్నట్లు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం తాను నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన జీవో కాపీ, కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ ప్రతులను జత చేసి ప్రతి వీవో మహిళా సంఘానికి స్వయంగా పంపినట్లు తెలిపారు. నిధులు ల్యాప్స్ కాకుండా ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి చేసి, పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

పంట నష్టపరిహారాన్ని అందించాలి

నల్లబెల్లి : వడగళ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్‌లో అర్శనపల్లి, గోవిందాపూర్, మేడెపల్లి, నల్లబెల్లి, నారక్కపేట క్లస్టర్లలో 1,619 మంది రైతులకు చెందిన 1,737 ఎకరాల్లో పంట నష్టం కాగా, అధికారులు చేసిన సర్వేకు అనుగుణంగా కేసీఆర్ ప్రభుత్వం రూ.1.80కోట్ల పరిహారం మంజూరు చేసిందని వివరించారు. ఖానాపూర్, చెన్నారావుపేట, దుగ్గొండి, నర్సంపేట, నర్సంపేట రూరల్ మండలాల్లో 29.17వేల ఎకరాల్లో పంట నష్టం జరుగగా నాటి సీఎం కేసీఆర్ స్వయంగా పరిశీలించి, ఎకరాకు రూ.10వేలు పరిహారాన్ని మంజూరు చేశారని పేర్కొన్నారు. ఆ నిధులు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పరిహారాన్ని అందించడం లేదన్నారు. వెంటనే రైతులకు డబ్బులు అందజేయాలని డిమాండ్ చేశారు.

రహదారులకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

వ్యాపారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దొంతి

నెక్కొండ, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ నుంచి వాగు వరకు, అంబేద్కర్ కూడలి నుంచి హైస్కూల్, బీసీ కాలనీ వరకు ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారులు, తహసీల్దార్ కార్యాలయం, బాలికల ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన డ్రైనేజీలను వెంటనే నిర్మించాలని ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవిని ఆదేశించారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్నందున పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారి వైపు నుంచి వాహనాలు ప్రమాదానికి గురికాకుండా రహదారిని విస్తరించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అండర్‌బ్రిడ్జి గోడలు ఎత్తుగా ఉన్నందున వ్యాపారాలు సరిగా సాగడం లేదని వ్యాపారులు చెప్పడంతో ఎత్తును తగ్గించి రీడిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల పాఠశాలను హైస్కూల్ ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాలకు మార్చి పాఠశాల ఆవరణలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి సుందరీకరణకు రూ.5లక్షలు మంజూరు చేస్తానని, అంతస్తు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

మంత్రి కొండా సురేఖకు అభినందనలు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 6: వరంగల్ జిల్లాలో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు కృషి చేసినందుకు మంత్రి కొండా సురేఖను శివనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేశ్, బత్తుల నవీన్, వడ్నాల మల్లయ్య, సదానందం, రాజేందర్ పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. ఖిలావరంగల్ మండలం రంగశాయిపేటలో ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయంపై ఇక్కడ యువతకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

జంతు సంరక్షణపై అవగాహన అవసరం

- కుక్కల దత్తతకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- మేయర్ గుండు సుధారాణి
- ప్రత్యేక యాప్, పోస్టర్ ఆవిష్కరణ

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఫిబ్రవరి 6 : జంతు సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర గార్డెన్‌లో వీధి, పెంపుడు కుక్కలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లో వీధి కుక్కల దాహం తీర్చేందుకు నీటి తొట్టిలను ఏర్పాటు చేస్తామన్నారు. కుక్కలను దత్తత తీసుకునే వారు కార్పొరేషన్‌కు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామన్నారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి, ప్రహరీ నిర్మించి కుక్కల సంరక్షణకు వినియోగిస్తామని తెలిపారు. బల్దియా చేపట్టే ఏ కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయన్నారు. పెట్ బ్రీడర్లు, బల్దియా సమన్వయంతో పెట్ రిజిస్ట్రేషన్, పెట్ అడాప్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ వీధి కుక్కల దాడులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేటర్ల సహకారంతో ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు చేపడుతామన్నారు. లైసెన్స్ లేని పెంపుడు కుక్కలను కార్పొరేషన్ సిబ్బంది తీసుకెళ్తారన్నారు. కొత్తగా బల్దియా నుంచి కార్పస్ ఫండ్‌ను ప్రారంభించామని చెప్పారు. అనంతరం పెట్ రిజిస్ట్రేషన్ యాప్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సురేశ్ జోషి, గుండేటి నరేందర్ కుమార్, పోశాల పద్మ, బస్వ రాజ్ కుమారస్వామి, దిడ్డి కుమారస్వామి, చింతాకుల అనిల్‌కుమార్, సిద్దం రాజు, ఓని స్వర్ణలత, సోమిశెట్టి ప్రవీణ్, ఆకుల మనోహర్, అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, డీఈవో అబ్దుల్‌హై, పంశు సంవర్థక శాఖ అధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పశ్చిమ నియోజవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. కుడా కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి వారు నియోజవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రకాళీ బండ్, వడ్డేపల్లి బండ్, అంతర్గత డ్రైనేజీ, రహదారుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, కుడా ఈఈ భీమ్‌రావు, బల్దియా ఈఈ రాజయ్య, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీతంపై ఆసక్తి పెంచుకోవాలి

సంకీర్తన ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్, ఫిబ్రవరి 6 : పాశ్చాత్య సంగీతం వైపు పరుగులు పెట్టకుండా యువత శాస్త్రీయ సంగీతం అభ్యసించాల్సిన ఆవశ్యకత ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం పోతన విజ్ఞాన పీఠంలో జరిగిన త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ త్యాగరాజ స్వామి కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో భద్రకాళీ ఆలయ చైర్మన్ బండారి శేషగిరిరావు, కర్ణాటక సంగీత విద్వాంసుడు గోపీనాథ్, విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల అధ్యాపకుడు సింగారపు భాస్కర్, తిరుపతయ్య, హరి విజయశ్రీ, లాయక్ అహ్మద్, కుంట రాజు, లక్షణాచారి, షణ్ముక ప్రియ, మధులిక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఖిలావరంగల్ : పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఓటర్ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సాయంత్రం కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని ఈఆర్వోలు, ఏఆర్వోలతో మండలాల వారీగా పట్టభద్రుల ఓటర్ల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వివరాలపై సమీక్షించారు. జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు 33,993 దరఖాస్తులు రాగా, అందులో 33,905 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో, 88 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో వచ్చినట్లు పేర్కొన్నారు. ఈఆర్వోలు షేక్ రిజ్వాన్ బాషా, అశ్విని తానాజీవాకడే, కృష్ణవేణి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

శాయంపేట ఫిబ్రవరి 6 : శాయంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట పత్తిపాక గ్రామస్తులు మంగళవారం ధర్నా చేశారు. గత నెల 12న పత్తిపాకకు చెందిన పోతుగంటి వంశీ, ఎల్తూరి పవన్ ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఎల్లాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పెయింటింగ్ కాంట్రాక్టర్ సుధాకర్ వీరిని తీసుకెళ్లడంతో ఆయన బాధ్యత వహించి న్యాయం చేయాలని గత నెల 13న ఆయన ఇంటి ముందు మృతదేహాలతో ధర్నా చేశారు. ఈ క్రమంలో సీఐ మల్లేశ్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చి వారిని పంపించారు. అయితే, కాంట్రాక్టర్ సుధాకర్ ఇప్పటివరకూ న్యాయం చేయలేదని ఆరోపిస్తూ, వంశీ, పవన్ కుటుంబ సభ్యులు, బంధువులు శాయంపేట పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. సీఐ మల్లేశ్, ఎస్సై దేవేందర్ ఆందోళనకారులతో మాట్లాడి న్యాయం చేస్తామని నచ్చజెప్పి పంపించారు.

ఖాళీ బిందెలతో ఎస్ఎఫ్ఐ ధర్నా

శాయంపేట, ఫిబ్రవరి 6 : మండలంలోని పెద్దకోడెపాక దళిత కాలనీల్లో 15 రోజులుగా నల్లా నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాయంపేట ఎంపీడీవో ఆఫీసు ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఖాళీ బిందెలను అడ్డుగా పెట్టి తాగునీరు అందించాలని నినదించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, కల్యాణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి

నర్సంపేట, ఫిబ్రవరి 6 : విద్యార్థుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ–పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నర్సంపేట ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు గుర్రం అజయ్, ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో కోడి భవ్యశ్రీ, గాదె వైష్ణవి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయన్నారు. విచారణ జరిపించి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు విక్రం, ప్రశాంత్, శివ, అనిల్ పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టాలి : గ్రేటర్ కమిషనర్

వరంగల్, ఫిబ్రవరి 6 : తాగునీటి వృథాను అరికట్టాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం చింతగట్టు, హసన్‌పర్తి, జవహర్‌కాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. చింతగట్టు ప్రాంతంలో తాగునీరు వృథాగా పోతుండడాన్ని గమనించిన ఆయన నీటిని వృథా చేసిన వారి నల్లా కనెక్షన్‌ను కట్ చేయాలని అధికారులను ఆదేశించారు. రెండేళ్లుగా నల్లా పన్ను చెల్లించని ఇంటి యజమానులు 10 రోజుల్లో చెల్లించాలని, లేకపోతే కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. గ్రేటర్‌లోని డివిజన్ల పారిశుధ్య కార్మికుల గైర్హాజర్ వివరాలను సేకరించి రోజువారీగా అందజేసేందుకు ప్రత్యేకంగా ఒక జవాన్‌ను నియమించాలన్నారు. మారుతీనగర్‌లో సుదీర్ఘకాలంగా హాజరుకాని కార్మికురాలిని తొలగించాలని సీఎంహెచ్‌వోను ఆదేశించారు. రాజాజీ కాలనీ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జవహర్‌నగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలన్నారు. తనిఖీల్లో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, డీఈ రవికుమార్, ఏఈ హరికుమార్, భీమయ్య, బాషా నాయక్ పాల్గొన్నారు.

మండల ఆఫీస్‌ను సందర్శించిన సెంట్రల్ సెక్రటేరియట్ అధికారులు

పర్వతగిరి, ఫిబ్రవరి 6: మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం సెంట్రల్ సెక్రటేరియట్ సెక్షన్ అధికారుల (గ్రూప్ డీ అధికారులు) బృందం స్టడీ టూర్‌లో భాగంగా సందర్శించింది. అధికారులు బొప్పాదేయ్, సౌమిత్రా బిస్వాస్, అశ్విన్ వర్మ, నిఖిల్‌తోపాటు 16 మందితో కూడిన బృందానికి స్థానిక సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బంది విభాగాలు, విధులను వారు అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఉపాధి హామీ, పంచాయతీ, ఐకేపీ, కేజీబీవీ స్కూల్, రూర్బన్ పథకంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, కన్వెన్షన్ హాల్, ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించారు. చింతనెక్కొండలో కూరగాయల పందిళ్లు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను చశారు. జడ్పీ సీఈవో గూడూరి రాంరెడ్డి, డీఆర్‌డీవో సంపత్‌రావు, అడిషనల్ డీఆర్‌డీవో వసుమతి, ఎంపీడీవో చక్రాల సంతోష్‌కుమార్, ఎంపీవో పాక శ్రీనివాస్, ఏపీవో సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

10న ఐటీఐలో అప్రెంటిస్‌మేళా

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 6 : హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(హెలికాప్టర్ తయారీ సంస్థ) ఆధ్వర్యంలో ఈ నెల 10న వరంగల్ ప్రభుత్వ బాలుర ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. అభ్యర్థులు ఫిట్టర్ లేదా మెషినిస్ట్ ట్రేడ్లలో ఉత్తీర్ణులై, 18 నుంచి 24 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ఫిట్టర్–50, మెషినిస్ట్–10 ఖాళీలు ఉన్నాయని, స్టైఫండ్ రూ.9 వేలు ఇస్తారని, ఆసక్తి గలవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు 15 వరకు గడువు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 6 : హనుమకొండ జిల్లాలోని నాలుగు తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలు, నాలుగు కాలేజీల్లో(ఇంగ్లిష్ మీడియం) 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మీన శ్రీను తెలిపారు. 5, 6, 7, 8వ తరగతిలో, ఇంటర్మీడియట్‌లో చేరే అర్హులైన విద్యార్థులు www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 6 : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు బుధవారం చివరి గడువని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 4,500 జరిమానాతో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు చెల్లించాలన్నారు.

అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌పై సదస్సు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 6: అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌పై వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ సీకేఎం కాలేజీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరంగల్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ మాధవి మాట్లాడుతూ ఈ పథకానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 11వ తేదీ వరకు https//agnipathvayu.cdac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఏఎఫ్ సార్జంట్ కే రాజేశ్, డీ మిశ్రా, అరుణ, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 6: వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డిపై బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ జోనా మంగళవారం తెలిపారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లపై పలువురు కౌన్సిలర్లు జిల్లా అధికారులకు అవిశ్వాస తీర్మానం కోరుతూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

టేకు దుంగల చోరీ

నల్లబెల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని బోల్లోనిపల్లిలో గీత కార్మికుడు గాజర్ల రాజమల్లు తన వ్యవసాయ భూమిలో పెంచుకున్న టేకుచెట్లను నరికేయగా, ఇంటి ముందు వేసుకున్న దుంగలు అపహరణకు గురయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ఐదు దుంగలను అపహరిస్తుండగా సీసీ కెమెరాలో రికార్డు కాగా అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి సీసీ టీవీ పుటేజీని పరిశీలిస్తున్నట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 6: గ్రేటర్ వరంగల్ 34వ డివిజన్‌లోని శివనగర్‌లో అక్రమ నిర్మాణాలను మంగళవారం పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, డీఆర్ఎఫ్, అధికారులు సంయుక్తంగా తొలగించారు. టీఎస్ బీపాస్‌లో మంజూరైన నక్షను ఖచ్చితంగా పాటిస్తూ ఎలాంటి డీవియేషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని సిటీ ప్లానర్ వెంకన్న తెలిపారు. స్థలాలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బల్దియా ఏసీపీ సుష్మ పాల్గొన్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును సన్మానిస్తున్న నాలుగో బెటాలియన్ సిబ్బంది

బెటాలియన్‌లో ఎమ్మెల్యేకు సన్మానం

కరీమాబాద్, ఫిబ్రవరి 6 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మామునూరు నాలుగో బెటాలియన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం బెటాలియన్ ఆవరణలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. పోలీస్ శాఖలో విస్తృత సేవలు అందించి ఉద్యోగ విరమణ పొంది, ఆ తర్వాత ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసుగా గడిపిన తనకు వారి బాధలు కష్టాలు తెలుసన్నారు. బెటాలియన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వర్ధన్నపేట : మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ విజయ్‌సాగర్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈవీఎంల మొదటి దశ తనిఖీ

హనుమకొండ చౌరస్తా : ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

హనుమకొండ చౌరస్తా/కాశీబుగ్గ, ఫిబ్రవరి 6 : వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాముల వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల మొదటి దశ తనిఖీ(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ మంగళవారం రెండో రోజూ కొనసాగింది. ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. మొదటి దశలో 755 బ్యాలెట్ యూనిట్లు, 628 కంట్రోల్ యూనిట్లు, 765 వీవీ ప్యాట్ల పనితీరును అధికారులు, సాంకేతిక నిపుణులు తనిఖీ చేస్తున్నారు. తహసీల్దార్లు బాబ్‌సింగ్, నాగరాజు, జ్యోతి వరలక్ష్మీదేవి, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే, తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల మొదటి దశ తనిఖీని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, విశ్వనారాయణ పాల్గొన్నారు.

'అయోధ్య'కు ఆస్తా ప్రత్యేక రైలు పరుగులు

కాజీపేట నుంచి తరలిన 1,226 మంది భక్తులు

కాజీపేట, ఫిబ్రవరి 6 : కాజీపేట నుంచి మంగళవారం సాయంత్రం 20 బోగీలతో ఆస్తా ప్రత్యేక రైలు అయోధ్యకు బయలుదేరింది. కాజీపేట జంక్షన్‌లో బీజేపీ ఎమ్మెల్యే కాట్రపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా జెండా ఊపి రైలును ప్రారంభించారు. 1,346 మంది రిజర్వేషన్ చేయించుకోగా, రైలు బయలుదేరే రెండు గంటల ముందు నిర్వాహకులు భక్తులకు రైలు టికెట్ ఐడెంటీ కార్డులను అందజేశారు. కాగా, 1,226 మంది ప్రయాణికులు మాత్రమే వెళ్లారని, 120 మంది గైర్హాజరైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఆర్ఎం గోపాల్ నాయక్, స్టేషన్ మాస్టర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. అయితే, హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీకి చెందిన ప్రభావతి, వసంత, రామిరెడ్డి, భూపతి సత్యనారాయణకు ఐడెంటిటీ కార్డులు అందకపోవడంతో వెళ్లలేకపోయారు.

మేడారం భక్తులు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాట్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 : మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రూట్ మ్యాప్‌లను ఏర్పాటు చేశామని సీఐ రవిరాజు అన్నారు. మంగళవారం దామెర మండలం డిస్నీలాండ్ స్కూల్ నుంచి ఆత్మకూరు మండలం కటాక్షపురం శివారు వరకు రహదారిని పరిశీలించారు. రోడ్డుకిరువైపులా ఉన్న పొదలు, జంగిల్ కటింగ్ చేశామన్నారు. మలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్‌ను అంటించామన్నారు. కార్యక్రమంలోఎస్సై ప్రసాద్, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 : మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు బస్టాండ్ నుంచి రాణిగంజ్ ఆర్టీసీ డిపో బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎంవో భీంరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరులోని బస్టాండ్‌ను డిప్యూటీ ఆర్ఎం(ఎం) సురేశ్ చౌహాన్, రాణిగంజ్ డిపో మేనేజర్ లక్ష్మీధర్మా, రామారావు పరిశీలించారు. మేడారానికి 35 బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు.

నర్సంపేట నుంచి..

నర్సంపేట : మేడారం మహాజాతరకు బుధవారం నుంచి నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులను నడుపనున